క్లుప్తంగా

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. డిపో నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరుతుందన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు కొండకు షటిల్ తిరుగుతుందన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

గ్వాలియర్ క్యాంపునకు ఎన్‌సీసీ విద్యార్థులు

మదనపల్లె సిటీ: మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరగనున్న జాతీయస్థాయి ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా రాక్‌లైనింగ్ శిక్షణ కార్యక్రమానికి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థినులు కె.వైష్ణవి, ఎస్.సంజన ఎంపికయ్యారు. వీరు ఈనెల 9వ తేదీ నుంచి గ్వాలియర్‌లో జరిగే క్యాంపులో పాల్గొంటారని ఎన్‌సీసీ అధికారి దేవకమ్మ తెలిపారు. పాఠశాలకు అరుదైన అవకాశం లభించిందన్నారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

సారా స్వాధీనం



సారాతోపాటు నిందితున్ని అరెస్ట్ చేసిన సెబ్ అధికారులు

కేవీపల్లె : మండలంలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు పీలేరు సెబ్ సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పెండ్లిపెంట సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. పెండ్లిపెంటకు చెందిన చంద్రయ్య సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే జిల్లేళ్లమంద తండా సమీపంలో దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది యోగానంద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

కలకడ : బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సిటిస్వామి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలికిరి మండలంలోని సీకాం జూనియర్ కళాశాల బస్సు డ్రైవర్ దేవేంద్ర కోన గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లినట్లు విద్యార్థిని తండ్రి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డిస్లెక్సియా బాధితులను శక్తివంతులుగా చేయాలి



మాట్లాడుతున్న కన్వీనర్ భాగ్యలక్ష్మి

మదనపల్లె సిటీ: డిస్లెక్సియాతో బాధపడేవారిని శక్తివంతం చేయాలని వెలుగు ప్రత్యేక పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ప్రపంచ డిస్లెక్సియా డే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డిస్లెక్సియా అనేది చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను ప్రభావితం చేసే అభ్యాస వైకల్యమన్నారు. ఇందు కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో బాధపడేవారిని కలుసుకొని నేర్చుకునే వాతావరణం కల్పించాలన్నారు. అందరిలో ప్రతి లోపాలను ప్రతి ఒక్కరు అంగీకరించాలని, అంగీకరించబడంతోనే లోపాలను అధిగమించవచ్చునన్నారు. డిస్లెక్సియా డే ప్రతిబింబించేలా అందరూ ఎరువు రంగు దుస్తులను ధరించి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది స్వీటీ, జయంతి తదితరులు పాల్గొన్నారు.

నూతన సర్పంచ్‌కు డిప్యూటీ సీఎం అభినందన



జీనత్‌షఫీకి అభినందనలు తెలుపుతున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

పీలేరు : పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన షేక్ జీనత్ షఫీకి ఆదివారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా అభినందనలు తెలిపారు. ఆదివారం సర్పంచ్ నివాసానికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేయాలన్నారు.

సచివాలయాలు.. సేవానిలయాలు

- సచివాలయ వ్యవస్థతో గడప గడపకూ ప్రభుత్వ పథకాలు
- పరిపాలన వ్యవస్థలో ఒక విప్లవం గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారం
- మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే సేవలు



మైళ్లకొద్దీ వెళ్లాల్సిన అవసరం లేదు.. నెలల పాటు నిరీక్షించాల్సిన పని లేదు..కావాల్సిన ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదు.. ఏ పని కావాలన్నా ఇంటి ముంగిటకే వచ్చేలే జగనన్న ప్రభుత్వ హయాంలో జరుగుతున్నాయి. గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారం అవుతోంది.

వాల్మీకిపురం: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందించాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైంది. ప్రజలు సులభతరంగా ప్రభుత్వ సేవలు అందుకుంటున్నారు. కీలకమైన రెవెన్యూ సేవలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు, పన్నుల చెల్లింపులు, సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు క్షేత్రస్థాయిలో కార్యదర్శులకు సహాయంగా నిలుస్తున్నారు.

సచివాలయాల్లో విస్తృత సేవలు :
వాల్మీకిపురం మండలంలో 2వేల జనాభాకు ఒకటి చొప్పున 14 సచివాలయాలను ఏర్పాటు చేశారు.

వాల్మీకిపురం మండలంలో..	
సచివాలయాలు	: 14
జనాభా	: 48758
అందుతున్న సేవలు	: 542
సెక్రటరీలు	: 14
గ్రామ వలంటీర్లు	: 232

ఒక్కో సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించి 10 నుంచి 12 మంది కార్యదర్శులు ఉన్నారు. సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా వ్యవహరిస్తుంటారు. భూ సమస్యల పరిష్కారానికి వీఆర్వో, సర్వేయర్లను నియమించడంతో రైతుకు సత్వర న్యాయం జరుగుతోంది. సచివాలయాల్లో 500 సేవలకు సంబంధించిన ఆన్‌లైన్ పనులను డిజిటల్ అసిస్టెంట్ అందిస్తుండడంతో ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గాయి. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వలంటీర్ల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

రైతుల ముగింటకు సేవలు
రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పనిముట్లు అందించడానికి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించడంతో వ్యవసాయం సులభతరమైంది. పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు పాడి రైతులకు తెలియజేసేందుకు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ నిమగ్నమై ఉంటారు. నాడు – నేడు పనులు, గ్రామ అభివృద్ధి పనులతో పాటు జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, శాంతిభద్రతలు, విద్యుత్ సమస్యలు తీర్చడానికి మహిళా పోలీస్, ఎనర్జీ అసిస్టెంట్‌లను ఏర్పాటు చేయడంతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన వచ్చింది. ప్రజలు అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే వాటిని పరిష్కరిస్తున్నారు.

వలంటీర్లు అన్నీ తామై..
ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ ఏర్పాటు కావడంతో ఎలాంటి అవినీతికి తావు లేకుండా అవసరమైన అన్నీ సేవలను అందిస్తున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ తమకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందలేదని బాధపడే సమస్యను తీర్చారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ఇంటి ముంగిటే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నారు.

సత్వరం సమస్యలు పరిష్కారం



సచివాలయాల సేవలు చాలా బాగున్నాయి. ప్రత్యేకించి మహిళలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. గ్రామంలోనే ఉన్నందున సులువుగా సచివాలయానికి వెళ్లగలుగుతున్నాం. సత్వరం సమస్యలనూ పరిష్కరించుకుంటున్నాం. స్త్రీనిధి, వైఎస్సార్ సున్నా వడ్డీ, చేయూత, ఆసరా, తదితర పథకాలు మహిళల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి.

– మంజుల, శాఖంవారిపల్లి, వాల్మీకిపురం

ఇంటి వద్దకు పథకాలు



గతంలో ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి పరుగులు తీసేవాళ్లం. ఒక పని కోసం అన్ని పనులు మానుకుని తిరిగే వాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రేషన్ కార్డు, ఇంటి స్థలం, పింఛన్, జనన, మరణ ధృవీకరణ పత్రాలు ఇలా ఏమి కావాలన్నా.. ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మా గ్రామంలోని సచివాలయం ద్వారా ఇంటి ముంగిటకే సర్టిఫికెట్లు వస్తున్నాయి.

– వెంకటేష్, విఠలం, వాల్మీకిపురం మండలం

రాష్ట్రస్థాయి పోటీలకు కన్నెమడుగు విద్యార్థి



తంబళ్లపల్లె: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలకు కన్నెమడుగు పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు హెచ్‌ఎం మదన్మోహన్ , పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కుప్పం మండలం చందం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన జిల్లా స్థాయి పోటీలలో కన్నెమడుగు పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని స్ఫూర్తి షూటింగ్‌బాల్ పోటీలో పాల్గొని ప్రతిభచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. త్వరలో అనంతపురంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఆ విద్యార్థినీని ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, టీచర్లు అభినందించారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి



సీఐ మధు

తంబళ్లపల్లె: పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ములకలచెరువు సీఐ మధు స్థానిక ఎస్‌ఐ లోకేష్ రెడ్డిని ఆదేశించారు. ఆదివారం ఆయన తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులు, ఫిర్యాదులు, పోలీసుల పనితీరు, మండలంలో జరిగే అసాంఘీక కార్యకలాపాల అంశాలు, నియంత్రణ చర్యలు తదితర అంశాలపై ఆరా తీశారు. నేరాలు తగ్గుముఖం పట్టిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కలికిరి: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గృహసారథులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. కలికిరి పట్టణ పరిధిలోని అజయ్ ఫంక్షన్ హాలులో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు రాబోయే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి వారితో మమేకమవ్వాలని, మళ్లీ రాష్ట్రానికి సీఎంగా జగన్ ఎందుకు అవసరమో వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ



మాట్లాడుతున్న నల్లారి తిమ్మారెడ్డి

నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, సర్పంచ్ వెంకటరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నాశేఖర్‌రెడ్డి, శివాజీ, ఆర్బీకేల మండల చైర్మెన్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అల్లాబక్షు, భోగేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖాన్ ఖలీల్, ఎంఐ హనీఫ్, అజయ్, ఖాదర్‌వలి, ఉస్మాన్, నూర్‌మొహ్మద్, విశ్వనాథ, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో నూతన షాదీమహల్ కోసం రూ. 30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ జీనత్ తెలిపారు. ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెడ్పీ నిధులతో 500 మీటర్ల పొడవుతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ముస్లింలు, హిందువుల వివాహాలకు రూ. 2 కోట్ల విలువ చేసే భూమి, రూ. కోటి వ్యయంతో షాదీమహల్ నిర్మించబోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డిల సహకారంతో అభివృద్ధి



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ

పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ గడిబాషా, నాయకులు నాగరాజ, రఫీ, ఖాదర్‌వల్లి, మోదీన్‌సాహెబ్, అల్లావుద్దీన్, ఇబ్రహీం, అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు షెడ్డు రేకులు చోరీ

గుర్రంకొండ: డంపింగ్‌యార్డు షెడ్డు పైకప్పు రేకులు చోరీకి గురైన సంఘటన మండలంలోని అమిలేపల్లెలో జరిగింది. దిగువ అమిలేపల్లెకు సమీపంలో డంపింగ్‌యార్డు నిర్మించారు. షెడ్డు పైకప్పుతో మంచినాణ్యత కలిగిన రేకులను అమర్చారు. గత శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు డంపింగ్ యార్డు పైకప్పుకు అమర్చిన ఐదు రేకుల్ని చోరీ చేసుకెళ్లారు. చోరీకి గురైన రేకుల విలువ సుమారు రూ: లక్ష వరకు ఉంటుందని అధికారులు అంటున్నారు. జరిగిన సంఘటనపై పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు సమాచారం అందించారు. ఆమె డంపింగ్‌యార్డు వద్దకు చేరుకొని పరిశీలించి పూర్తి వివరాలతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి పక్కనే ఉన్న డంపింగ్ యార్డు పైకప్పు రేకుల చోరీకి గురికావడం చర్చనీయాంశంగా మారింది.



అమిలేపల్లె డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రమీల

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: వసతి గృహాల్లోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీలేరు, మదనపల్లి డివిజన్‌లోని బీసీ వెల్ఫేర్ అధికారులు, హాస్టల్ వార్డెలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రతి వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనాలు ఉండాలని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, విద్యను అందించాలని సూచించారు. సురేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బాబు, మునస్వామినాయక్, ఉమామహేశ్వరి, భారతి, సుబ్బరామయ్య, శాంతసలోమి, భారతి, హేమచంద్ర, లలిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బైపాస్‌తో తొలగుతున్న ఏళ్లనాటి నిలువు రాయి

కురబలకోట: కురబలకోట మండలం కనసానివారిపల్లె వద్ద పొలాల్లో ఏళ్లుగా ఉన్న పురాతన నిలువు రాయికి ఆదివారం కనసానివారిపల్లె, దిగువపల్లె, కొత్తూరు, ములకవారిపల్లె గ్రామాల మహిళలు డీలు, బోణాల కార్యక్రమం నిర్వహించారు. పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఇంతకూ ఈ రాయికి పూజలు ఎందుకు చేశారంటే.. ఈ నిలువురాయి ఉన్న పొలాల మీదుగా కొత్తగా బైపాస్ రోడ్డు వేస్తున్నారు. ములకలచెరువు నుంచి మదనపల్లె (ఎన్‌హెచ్ 42) వరకు రూ.480 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా దొమ్మన్నబావి నుంచి వస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఈ పురాతన రాయిని కూడా తొలగించనున్నారు. కాంట్రాక్టరు ఈ నిలువురాయిని బైపాస్ పక్కన ఏర్పాటు



కనసానివారిపల్లె వద్ద ఉన్న పురాతన నిలువు రాయి

చేస్తారని ఆ గ్రామ సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి, నల్లగ్గారి బయ్యారెడ్డి, వన్ను కొండారెడ్డి, మూలింటి శంకర్ రెడ్డి తెలిపారు. దీంతో ముందుగా డీలు, బోణాలు కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ములకలచెరువు: జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ములకలచెరువు మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 6వ తేదీ తిరుపతిలో జరిగిన త్రోబాల్, బాల్‌బ్యాట్మింటన్, టెన్నీకాయిడ్ పోటీల్లో ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిని ఆదివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, పీడీ ముషాహిద్ తదితరులు ప్రత్యేకంగా సన్మానించారు.

ముమ్మరంగా డ్రైనేజీ నిర్మాణ పనులు

తంబళ్లపల్లె: మండల కేంద్రంలో డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సుమారు రూ.66 లక్షల నిధులను విడుదల చేయించారు. సర్పంచు నీలూఫర్, మైనుద్దీన్ పనులను నిర్వహిస్తున్నారు. పనుల నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.

రెడ్డెమ్మతల్లీ కరుణించమ్మా



ససంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు. పలువురు భక్తులు ఆలయమెట్లకు పూజలు నిర్వహించి మోకాళ్లపై నడుచుకొంటూ మొక్కలు చెల్లించుకొన్నారు. రాయలసీమ జిల్లాలో తోపాటు కర్ణాటకా, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వాల్మీకిపురం: స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ షిరిడి సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బెంగళూరు, ఎమ్ఎస్ రామయ్య మెడికల్ కాలేజీ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 220మందికి వైద్య సేవలు నిర్వహించి, మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో కేన్సర్, మెదడు, మూత్రపిండాలు, ప్లాస్టిక్ సర్జరీ, రక్తనాళ, కిడ్నీ, సాధారణ శస్త్ర చికిత్సలకు సంబంధించిన సేవలను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఎంతో మంది నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం శుభపరిమాణమన్నారు. అనంతరం కళాశాల



వైద్య పరీక్షలకు పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చిదంబరం రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నాయకులు చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, అబ్దుల్ కలీమ్, రాయుడు, షాహెద్, సాధిక్, ఇబ్రహీం, డాక్టర్లు శ్రీనివాసులు, హరిచంద్ర, ఆకాష్, కౌశిక్, రిశర్గా, ఆనంద్, ఆషం, రాఘవేంద్ర, సిద్ధార్థ, అరవింద్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో వాల్మీకుల ఎస్టీ సాధన

కురబలకోట: ఐకమత్యంతో వాల్మీకుల ఎస్టీ సాధన సాధ్యమని వాల్మీకి సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం కురబలకోట మండలంలోని దొమ్మన్నబావి వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో జరిగిన వాల్మీకి గర్జన సభలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా ఫలితం లేకుండా పోతోందన్నారు. ఇందుకు వాల్మీకుల్లో అనైక్యతే కారణమన్నారు. అవకాశ వాద సంఘాలను బహిష్కరించాలన్నారు. పార్టీలకు అతీతంగా ఏకం కావాల్సి ఉందన్నారు. పోరాటాల ద్వారానే ఎస్టీ సాధన సిద్ధిస్తుందన్నారు. భావి తరాల బిడ్డల కోసమైనా ఎస్టీ సాధనకు నడుం బిగించాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తెట్టు గ్రామ మాజీ ఉప



వాల్మీకి గర్జన సభలో నాయకుల సంఘీభావం

సర్పంచ్, గర్జన సభ కన్వీనర్ యనమల నారాయణ, మాజీ డీఎస్పీ సుకుమార్ బాబు, వెంకటేష్, కుప్పం సురేష్, రమణ, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, అనిల్,రాము, హరి, మనోహర్, వెంకటరమణ, జయసింహ, మంజు, మధు, రామక్రిష్ణ, కొండన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కలికిరి: యువత క్రీడల్లో రాణించాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి, గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి అన్నారు. కలికిరి సమీపం పాట్టేకులవారిపల్లి గ్రౌండ్‌లో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టార్టప్ వారియర్స్ టి20 లీగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతూ యువత క్రీడలలో నైపుణ్యం పెంపొందించుకోవాలని, క్రికెట్‌లో నైపుణ్యాభివద్ధికి ఇలాంటి లీగ్ మ్యాచ్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ నెల రోజుల పాటు జరుగు ఈ లీగ్ మ్యాచ్‌లలో ఉమ్మడి చిత్తూరు జిల్లా, ఇతర జిల్లాల నుంచి 16 టీంలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఫైనల్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన టీంలకు రూ.లక్ష, రూ.65 ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, చిన్నపరెడ్డి, నిర్వాహకులు ధీరజ్ రెడ్డి, ప్రవీణ్, బోయకొండ, మనోజ్ పాల్గొన్నారు.



టి20 లీగ్‌ను ప్రారంభిస్తున్న రత్నశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి

గాంధీపురంలో సమస్యలు పరిష్కరించాలి

– బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెలగౌతమ్

మదనపల్లె : పట్టణంలోని గాంధీపురంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటుగా రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరపాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలగౌతమ్ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీపురంలో ఇంటింటికీ పర్యటించిన ఆయన స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు నీళ్లు సరైన సమయానికి వదలకుండా వారానికి ఒకసారి వదులుతున్నారని, కాలువలు సరిగ్గా శుభ్రం చేయడం లేదని, మూడు నెలల నుంచి రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరపలేదని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా బందెలగౌతమ్ మాట్లాడుతూ.. కూలికి వెళితే కాని ఇల్లు గడవని పేదలు ఉన్న గాంధీపురంలో సమస్యలపై అధికారులు దృష్టి పెట్టకపోవడం దారుణమన్నారు. ప్రజాసమస్యలపై మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోతే, బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంధ్య, రాణి, ప్రసన్న, బీఎస్పీ నాయకులు రమణ, బాలాజీ, గంగాధర్, శివ, అనిల్, అరుణ్, శీను, ముని తదితరులు పాల్గొన్నారు.



గాంధీపురంలో సమస్యలు తెలుసుకుంటున్న బందెలగౌతమ్